క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు పందిరి రాట



రాట ముహూర్తం చేస్తున్న కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఏటా దసరాకు ఘనంగా నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఉదయం 9.45 గంటలకు పందిరి రాట ముహూర్తం శాస్త్రోక్తంగా జరిగింది. శరన్నవ రాత్ర మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించేలా అమ్మవారి ఆశీర్వాదం ఉంటుందని శ్రీదేవి ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు అన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆశెట్టి ఆదిబాబు, మామిడిపల్లి రాంబాబు, మాజీ కౌన్సిలర్ వెలిగట్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

అల్లవరం: పేరూరు నుంచి గోడిలంక వరకూ జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గోడి, గోడిలంక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇన్‌చార్జి ఏఈ హరిబాబు బుధవారం తెలిపారు.

రక్తదానం

తాళ్లరేవు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరంలో 22 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు సేవా పక్వాడా పేరిట రోగుల అవసరాల నిమిత్తం రక్తాన్ని ఆస్పత్రిలో నిల్వ చేసుకునేందుకు ప్రతి నెలా ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. కోరంగి కైట్ ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్ని రక్తదానం చేశారు. ఆస్పత్రి కమిటీ డైరెక్టర్లు బి.శ్రీనివాసరెడ్డి, అద్దంకి లక్ష్మీనారాయణ, నాయకులు చిట్టూరి చలపతి, రెడ్డిబాబు, భైరవమూర్తి, మల్లేష్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులు నిర్వహించాలి

అమలాపురం రూరల్: గ్రామాల్లో వచ్చేనెలా ఒకటో తేదీ నుంచే నిర్వహించే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలపై అవగాహన ర్యాలీలు ఏర్పాటు చేయాలని డీపీవో కృష్ణకుమారి తెలిపారు. ప్రతి గ్రామానికి కనీసం రెండు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి, వాటిలో వంద పౌరులు పాల్గొనే చూడాలని, వాటిని యాప్ పొందిపరచాలని ఆమె తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

అమలాపురం రూరల్: విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వామపక్ష సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు సీపీఎం జిల్లా కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు సీపీఎంఎల్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీమా అందజేత

తాళ్లరేవు: స్థానిక కేశవపురం కాలనీకి చెందిన కాదా లక్ష్మణరావు(45) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకంలో మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలను మృతుని భార్య కనకరత్నంకు స్థానిక సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి అందజేశారు.

నేటి నుంచి రవ్వ ప్లాంట్ షట్ డౌన్

అల్లవరం: ప్లాంట్ నిర్వహణ కార్యకలాపాల నేపథ్యంలో ఎస్.యానంలోని చమురు సంస్థ రవ్వ ప్లాంట్‌ను మూడు రోజులపాటు షట్ డౌన్ చేస్తున్నట్టు ఆ సంస్థ యాజమాన్యం పంచాయతీకి సమాచారం ఇచ్చారని సర్పంచ్ జోగి రాజేశ్వరీ బుధవారం తెలిపారు. ఐదేళ్లకోకసారి ప్లాంట్ నిర్వహణలో భాగంగా షట్ డౌన్ చేస్తున్నామని దరఖాస్తులో పేర్కొన్నట్టు తెలిపారు. రవ్వ యాజమాన్యం గ్రామాభివృద్ధికి సంబంధించిన 15 డిమాంట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించేంత వరకు షట్‌డౌన్ చేయడానికి వీల్లేదని కార్మికులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారని, షట్ డౌన్‌ని అడ్డుకోవడం వల్ల ప్లాంట్ యాజమాన్యానికి నష్టం వస్తుందని, ఈ నెల 30న మంత్రి విశ్వరూప్ సమక్షంలో డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్డీఓ బి.వసంతరాయుడు అన్నారని సర్పంచ్ తెలిపారు.

ఘనంగా వరల్డ్ టూరిజం డే

ఐ.పోలవరం: స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరల్డ్ టూరిజం డేను ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం రీజినల్ డైరెక్టర్ ఒంటెద్దు స్వామి నాయుడు, జిల్లా టూరిజం ఆఫీసర్ వి.వెంకటాచలం ఆధ్వర్యంలో జిల్లాలో ఎంపికైన 14 పాఠశాలల విద్యార్థులకు టూరిజంపై అవగాహన కల్పించేలా డ్రాయింగ్, వక్తృత్వం, రంగోలి పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ ముదునూరి సతీష్ రాజు, ఎంపీపీ మోర్త మిరియం మేరీ జ్యోతి తదితరులు హాజరయ్యారు.

దళితవాడల సందర్శన

అల్లవరం: ఎస్సీ మోర్చా బస్తీ సంపర్క్ యోజన కార్యక్రమంలో భాగంగా బెండమూర్లంక గ్రామంలో బుధవారం దళిత వాడలను బీజేపీ జిల్లాఅధ్యక్షులు యాళ్ల దొరబాబు బుధవారం సందర్శించారు. కేంద్రం ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. దళితులకు కేంద్రం ఎన్నో పథకాలను తీసుకొచ్చిందన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సుంకర సాయి తదితరులు పాల్గొన్నారు.

బైబై గణేశా..!

- వైభవంగా గణపతి నిమజ్జనం
- ఉత్సాహంగా విగ్రహాల ఊరేగింపులు



గణనాథుని ఊరేగింపు



యానాంలో గణనాథుని నిమజ్జన ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

యానాం: గణనాథుని నవరాత్ర మహోత్సవాలు ముగియడంతో బుధవారం గణపతి విగ్రహాల నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్‌బీచ్ రహదారి గౌతమీ గోదావరి కోన సత్తియ్య జెట్టీ వద్ద నిమజ్జనం చేశారు. యానాం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన గణనాథుని విగ్రహాలను భారీగా ట్రాక్టర్లు, వివిధ వాహనాలపై ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్థానిక లక్ష్మీగణపతి వరసిద్ధి వినాయ వర్తకసంఘం, యానాం పాతబస్టాండ్ సెంటర్, శివాలయం వీధి, కనకాలపేట, చిల్డ్రన్స్‌పార్క్, టాక్సీస్టాండ్, గోపాల్‌నగర్, రవీంద్రనగర్, కురసాంపేట, పాత మార్కెట్ సెంటర్, ఓల్డ్ రాజీవ్ నగర్ తదితర ప్రాంతాలకు చెందిన గణనాథుని విగ్రహాలను మేళతాళాలు, నృత్యాలు, బాణ సంచా కాల్పుల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అగ్నిమాపకదళం సిబ్బంది వినాయక విగ్రహాలను ట్రాలీపై తీసుకువెళ్లి గోదావరిలో నిమజ్జనం చేశారు. వర్తకసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణనాథుని లడ్డు వేలంలో రూ.లక్షకు కాండ్రేగుల సతీష్ కైవసం చేసుకున్నారు.

ఐ.పోలవరం: మురమళ్ల గ్రామంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను మేళతాళాలతో, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి స్థానిక వృద్ధ గౌతమీ గోదావరిలో నిమజ్జనం చేశారు. అదేవిధంగా పశువుల్లంక, టి.కొత్తపల్లి, ఎదుర్లంక, కేశనకుర్రు, ఐ.పోలవరం, జి.వేమవరం, గోగుల్లంక తదితర గ్రామాల్లోని గణనాథులను ప్రత్యేక వాహనాలపై ఊరేగింపుగా తీసుకొని గోదావరిలో, పంట కాలువలలో నిమజ్జనాలు చేశారు. అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. గణేశ లడ్డూలను ఆలయ కమిటీ వారు వేలం పాటలు నిర్వహించారు.

వినాయకుని లడ్డూ రూ.31,500

ఉప్పలగుప్తం: వానపల్లిపాలెంలో వినాయకుని లడ్డూ రూ.31,500 భక్తులు దక్కించుకున్నారు. గ్రామంలోని ఆదిగణపతి స్వామివారి ఆలయం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వల్లభరెడ్డి రాంబాబు ఆర్థిక సహాయంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిమ్మన సత్యఋషి బహూకరించిన లడ్డూని వేలంలో నల్లా ఆదినారాయణ, వల్లభరెడ్డి రాంబాబు, వాకాటి సద్గురురావు, చిక్కం నాగబాబులు కలసి రూ.31,500లకు దక్కించుకున్నారు. అనంతరం స్వామి వారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

ముమ్మిడివరంలో రూ.9100

ముమ్మిడివరం: గ్రామంలో వినాయక లడ్డూ వేలం రూ.9100 పలికింది. గ్రామానికి చెందిన నందికం స్వామినాథ్ దక్కించుకున్నారు.

టౌన్‌లో రూ.22 వేలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో స్వామి వద్ద ఉంచిన 5 లడ్డూలకు వేలం నిర్వహించారు. కొంకాపల్లికి చెందిన భక్తులు బొర్రా ఈశ్వరరావు, పనసా శ్రీరామ్, చిక్కాల చిన్న, భూసారపు బుజ్జి ఈ లడ్డూలను రూ.22 వేలకు దక్కించుకున్నారు. అనంతరం ఎంటీటీసీ సభ్యుడు పనసా బుజ్జి, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగింపు జరిగింది.

వెత్సావారి అగ్రహారంలో..

పట్టణంలోని వెత్సావారి అగ్రహారంలో రెండు వినాయక లడ్డూలకు వేలం నిర్వహించారు. ఓ లడ్డూను సలాది జయ కృష్ణ రూ.6,900కు, మరో లడ్డూను సలాది లక్ష్మీ గణేష్ రూ.6,700 పాడుకున్నారు. అనంతరం ఆ చలువ పందిరిలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



కొంకాపల్లిలో వేలం పాటలో లడ్డూలను దక్కించుకున్న నలుగురు భక్తులు



వర్తకసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో లడ్డూను రూ.లక్షకు దక్కించుకున్న సతీష్



వానపల్లిపాలెంలో స్వామి వారి లడ్డూతో భక్తులు



అగ్రహారంలో జరిగిన వేలంలో దక్కించున్న లడ్డూలతో భక్తులు

మాదిగల సమస్యలపై చట్ట సభలో మాట్లాడే అవకాశం

ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



ముఖ్యమంత్రి జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా 75 ఏళ్ల చరిత్రలో మాదిగ ప్రజాప్రతినిధి చట్టసభకు వెళ్లే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ హాలులో ముఖ్యమంత్రి జగన్‌ను బుధవారం ఆయన కలిసి ప్రత్యేక కృతజ్ఞతలతో మాట్లాడారు. శాసనమండలిలో బుధవారం రాష్ట్రంలోని చర్మకారుల సమస్యలపై మాట్లాడే అవకాశం వచ్చిందంటే అది జగన్ ఇచ్చిన అవకాశమేనని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని విజయవాడ నుంచి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సాక్షికి బుధవారం రాత్రి తెలిపారు. అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు కూడా అసెంబ్లీ వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు.

చేతివృత్తిదారులను ఆదుకోవాలి

అల్లవరం: చెప్పులు కుట్టుకుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న మాదిగ సామాజిక వర్గీయులకు నిర్దిష్టమైన ఆదాయం లేక పేదరికంలో మగ్గిపోతున్నారని, వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శాసనమండలిలో బుధవారం ప్రస్తావించారు. పట్టణాల, ప్రధాన కూడళ్లలో చెప్పులు కుట్టడం కుల వృత్తిగా చేసుకుని బతుకుతున్న మాదిగలకు వయస్సుతో సంబంధంతో లేకుండా పింఛను ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వడ్డీ లేని బ్యాంక్ రుణాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేతో సంపూర్ణ ఆరోగ్యం

కాట్రేనికోన: జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వేతో రోగులను గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించడం వల్ల ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కలెక్టరు హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయి స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 51 అర్జీలు అందాయి. అనంతరం ఆర్డీఓ వసంత రాయుడుతో కలిసి తిమ్మాపురంలో జగనన్న సురక్ష సర్వేను కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య డేటా ఆన్‌లైన్ చేస్తున్న విధానాన్ని, మహిళ ఆరోగ్య వివరాలు ఆయన అడిగి తెలుసుకున్నారు. చిలకమ్మ చెరువులో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.నుపూర్ అజయ్, సీపీఓ వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ మధుసూధన్, డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి సత్యవాణి, డీఈఓ కమల కుమారి, ఎంపీడీఓ వెంకటాచలం, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్ష

అల్లవరం: కార్పొరేట్ స్థాయిలో ప్రజలందరికీ వైద్య సేవలందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టినట్టు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. ఎంపీడీఓ బీఎస్ఎస్ కృష్ణమోహన్ అధ్యక్షతన అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, డాక్టర్లు, సచివాలయం సిబ్బంది, ఆరోగ్య సిబ్బందికి జగనన్న ఆరోగ్య సురక్షపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 22 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆరోగ్య సురక్ష గురించి ప్రజలకు తెలిసేలా దండోరా, మైక్ ద్వారా ప్రచారం చేసేలా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డాక్టర్ సుమ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి పీహెచ్‌సీ నుంచి ఇద్దరు డాక్టర్లు, మరో ఇద్దరు వైద్య నిపుణులు హాజరై రోగులకు సేవలు అందిస్తారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి 15 రోజుల ముందునే క్షేత్రస్థాయిలో వలంటీర్, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ కలసి ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారని, వారికి ఉన్న రోగాలకు యాప్‌లో నమోదు చేస్తారని, సర్వే ఆధారంగా ప్రతి రోగికి కేసీటు ఇస్తామని తెలిపారు. సాధారణ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకటరామరాజు, వైస్ ఎంపీపీ ముత్యాల వెంకటరామకృష్ణ, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు సాధనాల వెంకటరావు, డాక్టర్లు బాల సుబ్రహ్మణ్యం, శాంతిప్రియ, స్పందన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



తిమ్మాపురంలో సర్వేను తనిఖీ చేస్తున్న కలెక్టరు హిమాన్షు శుక్లా



సమీక్షా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

రాష్ట్రస్థాయి పోటీలకు వెయిట్, పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు

అమలాపురం టౌన్: అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌కు చెందిన ముగ్గురు వెయిట్, పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్‌కు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. వెయిట్ లిఫ్టింగ్‌లోని 66 కేజీల విభాగంలో బి.యశ్వంత్, 61 కేజీల విభాగంలో పి.తరుణ్‌తేజ్ జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారని జిమ్ కోచ్ డాక్టర్ కంకపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 59 కేజీల విభాగంలో పి.తరుణ్‌తేజ, 83 కేజీల విభాగంలో బందారు కుమార్ జిల్లా స్థాయిలో సత్తా చాటి బంగారు పతకాలు సాధించారన్నారు. ఈ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. క్రీడాకారులను కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు జిమ్‌లో బుధవారం జరిగిన అభినందన సభలో ప్రశంసించారు. జిల్లా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు చీకురుమిల్లి కిరణ్‌కుమార్, పానకాల దుర్గాప్రసాద్, మారే వీరేంద్ర తదితరులు కూడా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా అసోసియేషన్, జిమ్ ప్రతినిధులు

ఖోఖోలో నవ్య ప్రతిభ

యానాం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయం పదో తరగతి విద్యార్థి నవ్య అఖిలభారత స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు బుధవారం ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలో పంచకుల నవోదయలో జరిగిన అఖిల భారత నవోదయ విద్యాలయాల స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొ నవ్య తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు.



రాష్ట్ర స్థాయి వాలీబాల్‌కు దేవగుప్తం విద్యార్థి

అల్లవరం: దేవగుప్తం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తాడి గణేష్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్ బుధవారం తెలిపారు. అనపర్తి ఎస్ఆర్ బాలురు ఉన్నత పాఠశాలలో అండర్-17 విభాగంలో మంగళవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్ టోర్నీలో వాలీబాల్ క్రీడలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక చేశారన్నారు. గణేష్‌ను సర్పంచ్ సాధనాల వెంకటరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల రాంబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఈతకోట రాజు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



తాడి గణేష్

రైతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్



రైతులకు విత్తనాల కిట్లను పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతోపాటు వారి ఆర్థికాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయమార్కెట్ కమిటీ భవనంలో వ్యవసాయశాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్యసంస్థ ఆధ్వర్యంలో రైతాంగానికి కూరగాయల సాగు, కిచెన్‌గార్డెనింగ్‌పై ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంత పొలాలకు సాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని, వ్యవసాయ శాఖ ద్వారా రైతులు మెలుకవలు పాటించి అధిక దిగుబడి సాధించాలని కోరారు. అనంతరం రైతాంగానికి విత్తనాల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, వ్యవసాయశాఖ డీడీ గణేషన్, వ్యవసాయాధికారి జోగిరాజు, ఫీల్డ్‌ఆఫీసర్లు ఖాన్, సుబ్బారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యానాం: అభివృద్ధిని అడ్డుకుంటూ, వ్యక్తిగతంగా తనపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢీల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మానకుంటే ప్రజలే ఆయనకు బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అన్నారు. నియోజకవర్గ సమస్యలపైన పుదుచ్చేరి స్థాయిలో గత రెండేళ్లుగా పోరాటం చేస్తుంటే తనపై విమర్శలు చేస్తున్నారని, ప్రజాతీర్పుతోనే తాను ఎమ్మెల్యేగా గెలిచానని దానిని తెలుసుకోవాలన్నారు.

మంత్రి విశ్వరూప్‌కు కృతజ్ఞతలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెన్నారావు

అమలాపురం రూరల్: ఈ ఏడాది మార్చి 17వ తేదీన కాకినాడలో కొబ్బరిబొండం వ్యాపారి చేతిలో దాడికి గురై ప్రస్తుతం కోలుకున్న కాకినాడ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చెన్నారావు మంత్రి విశ్వరూప్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారి చేతిలో దాడికి గురై తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన చెన్నారావును మంత్రి విశ్వరూప్ పరామర్శించి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందికి తెలిపారు. ప్రస్తుతం కోలుకున్న చెన్నారావు ఆర్టీవో కార్యాలయంలో విధుల్లో చేరారు. బుధవారం మంత్రి విశ్వరూప్‌ను కలిసి తనకు సాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

29, 30 తేదీల్లో క్రీడాకారుల ఎంపిక

యానాం: స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్)యానాం శాఖ ఆధ్వర్యంలో వివిధ అథ్లెటిక్స్‌ల్లో క్రీడాకారుల శిక్షణకు ఎంపిక పోటీలను ఈనెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు బుధవారం సెంటర్ ఇన్‌చార్జి జి.లింగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్(రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ బాలురు) స్విమ్మింగ్(నాన్ రెసిడెన్షియల్ బాలురు, బాలికలు), వాలీబాల్(రెసిడెన్షియల్, నాన్‌రెసిడెన్షియల్ బాలురు) పోటీలను స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు లింగేశ్వరరావు(వాలీబాల్ కోచ్)9490187723, ఉదయ్‌కుమార్ స్విమ్మింగ్ కోచ్ 8885176888, రాజేష్ బ్యాడ్మింటన్‌కోచ్ 9866239009నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

శస్త్ర చికిత్స చేయించుకున్న వివాహిత మృతి

- ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

అమలాపురం టౌన్: కాలి నరాలకు ఆపరేషన్ చేయించుకున్న పి.గన్నవరం మండలం పోతవరానికి చెందిన చిట్టూరి నాగమణి(35) మృతి చెందడంతో ఆమె కుటుంబీకులు, బంధువులు స్థానిక ఓ ఆస్పత్రి వద్ద బుధవారం మధ్యాహ్నం ఆందోళన చేశారు. ఆపరేషన్ వికటించి ఆమె చనిపోయిందని వారు ఆరోపిస్తూ నిరసన తెలిపారు. మృతురాలు నాగమణికి ఈ నెల 20వ తేదీన కాలి నరాలకు సంబంధించి ఆస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. 25న ఆస్పత్రి నుంచి ఆమెను డిశ్చార్జి చేశారు. ఇంటికి వెళ్లిన తర్వాత ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని కుటుంబీకులు తెలిపారు. బుధవారం ఉదయం ఆమె ఆపస్మారక స్థితికి వెళ్లడంతో ఆస్పత్రికి తీసుకుని రాగా ఈ లోపు ఆమె మృతి చెందడంతో శస్త్ర చికిత్స వికటించడం వల్లే ఇంతటి ఘోరం జరిగిందని కుటుంబీకులు ఆస్పత్రి వద్ద వైద్యులను నిలదీశారు. ఆందోళనకు దిగారు. చివరకు బాధిత కుటుంబానికి ఆసుత్రి యాజమన్యం నష్ట పరిహారం చెల్లించడంతో ఆందోళన విరమించారు. మృతురాలి భర్త ఉపాధి నిమిత్తం కువైట్‌లో ఉంటున్నాడు. ఆమెకు ఇంటర్మీడియెట్ చదువుతున్న కుమార్తె, పదో తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. తల్లి మరణంతో వారు ఆస్పత్రి వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు.

కోర్టు విచారణలో ఉన్న పేకాటక్లబ్ తెరవొద్దు

యానాం: కోర్టులో విచారణలో ఉన్న యానాం రాయల్ రిక్రీయేషన్‌క్లబ్‌ను తిరిగి తెరిచేందుకు చేసే ప్రయత్నాలను తాము అడ్డుకుంటామని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. బుధవారం దొమ్మేటిపేటలో ఉన్న పేకాటక్లబ్‌ను తెరిచేందుకు అనుమతి ఇవ్వవద్దని కోరుతూ ఆర్ఏఓ మునిస్వామికి, మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రకాశంకు ఆయన ఆధ్వర్యంలో పలువురు వినతిపత్రం అందజేశారు. అనంతరం మల్లాడి విలేకరులతో మాట్లాడుతూ రెండేళ్లుగా రాయల్ రిక్రీయేషన్ క్లబ్ నిర్వహిస్తున్నారని, అక్కడికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా వంటి ఆరు రాష్ట్రాల నుంచి పేకాట ఆడటానికి వస్తున్నారన్నారు. క్లబ్ మూసివేయాలని తాను పోరాటం చేయడంతో నవంబర్‌లో నిలిపివేశారని కాని మళ్లీ తెరిచి యథావిధిగా క్లబ్ నిర్వహించారన్నారు. అయితే క్లబ్ సభ్యుల మధ్య ఆర్థికపరమైన మనస్పర్థలతో 19వ తేదీ నుంచి క్లబ్‌ను మూసివేశారని మున్సిపల్ కమిషనర్ సైతం సొసైటీ రద్దు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కాని మళ్లీ క్లబ్‌ను తిరిగి తెరిచేందుకు ప్రయత్నిస్తున్నారని దీనిని వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామన్నారు. మాజీ మున్సిపల్ చైర్మెన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మెన్ పెండెం సూర్యప్రకాష్, ఎస్ఆర్‌కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, సుంకర కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేసి జైలుకు వెళితే సమర్థింపా..?!

- టీడీపీ, జనసేన నిరసనలపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల అభ్యంతరం
- సమావేశ బహిష్కరణపై ఆగ్రహం



సమావేశంలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష కౌన్సిలర్లకు ధీటుగా నినాదాలు చేస్తున్న పాలక పక్ష కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: స్కిల్ స్కామ్‌లో అరెస్టుతో రిమాండ్ ఖైదీగా జైలుకు వెళ్లిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మద్దతుగా అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రతి పక్షాలైన టీడీపీ, జనసేన కౌన్సిలర్లు నిరసనలు వ్యక్తం చేశారు. అభివృద్ధికి సంబంధించిన అజెండా అంశాలపై చర్చించకుండా సమావేశాన్ని బహిష్కరించారు. సమావేశంలో ప్రతి పక్ష కౌన్సిలర్లు చంద్రబాబుది అక్రమ అరెస్టు అని నినాదాలు చేయడంతో దానిపై పాలక పక్ష వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం చెప్పారు. ప్రతి పక్ష కౌన్సిలర్ల నిరసనకు ప్రతిగా పాలక పక్ష కౌన్సిలర్లు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చంద్రబాబు తప్పు చేసి జైలుకు వెళితే మీరు ఎలా సమర్థిస్తారంటూ ధ్వజమెత్తారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం ఉయదం జరిగిన కౌన్సిల్ సమావేశంలో తొలుత ప్రతిపక్ష కౌన్సిలర్లు చంద్రబాబు అక్రమ అరెస్ట్ అంటూ నినాదాలు చేసి సమావేశాన్ని బహిష్కరించారు. దీనిపై పాలక పక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని స్పందిస్తూ ‘‘మీరు ఎందుకు సమావేశాన్ని బహిష్కరిస్తున్నారు. స్కిల్ స్కామ్, అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్ వర్క్‌లో అక్రమాలకు పాల్పడిన చంద్రబాబు కోసం చేస్తున్నారా..? అంటూ ఎదురు ప్రశ్నించారు. కోర్టులో ఉన్న చంద్రబాబు అరెస్టు వ్యవహారాన్ని కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించడం, నిరసన వ్యక్తం చేయడం సరి కాదని హితవు పలికారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు చంద్రబాబుకు అనుకూలంగా నినాదాలు చేస్తే అందుకు ధీటుగా పాలక పక్ష కౌన్సిలర్లు ప్రతి నినాదాలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు రుద్రరాజు నానిరాజు, తిక్కిరెడ్డి వెంకటేష్ కూడా అక్రమాలు చేసిన దొంగకు వత్తాసు పలుకుతారా..? అంటూ టీడీపీ, జనసేన కౌన్సిలర్ల తీరుపై మండిపడ్డారు.

ఒకే పనికి రెండు సార్లు అంచనాలా..?

గతంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపు, టెండర్ల ప్రక్రియ పూర్తి అయి కౌన్సిల్ ఆమోదం పొందిన వాటికి కూడా తాజాగా మళ్లీ కొత్త అంచనాలు రూపొందించడంపై పాలక కౌన్సిలర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలక పక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు మాట్లాడుతూ తాజాగా పట్టణంలోని 30 వార్డులకు గడప గడపకూ మన ప్రభుత్వం నిధుల వార్డుకు రూ.10 లక్షల వంతున మొత్తం రూ.3 కోట్లు విడుదలయ్యాయని చెప్పారు. గతంలో సాధారణ నిధుల నుంచి ఎంపికచేసిన పనులు, నిధులు మంజూరు, టెండర్ల ప్రక్రియ, కౌన్సిల్ ఆమోదం వంటి దశలు ముగిశాయని గుర్తు చేశారు. కాంట్రాక్టర్ల జాప్యం వల్ల అందులో కొన్ని పనులు మొదలు కాలేదు. ఇప్పుడు అధికారుల పర్యవేక్షణ లోపంతో కొన్ని పనులను అధికారులు మళ్లీ రూ.3 కోట్ల నిధులలో అంచనాలు తయారు చేసి కౌన్సిల్ ఆమోదానికి ఉంచారు. అధకారులు పనులను చెక్ చేసుకొని ఎంపిక చేయాలని సూచించారు. రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఎత్తివేతపై కోనసీమ రైల్వే సాధన సమితి హైకోర్టులో వేసిన కేసును గౌరవ కోర్టు కొట్టి వేసిన దృష్ట్యా మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుల దృష్టిలో ఈ విషయాన్ని ఉంచి రైల్వే అధికారులు ఖాళీ చేసిన మున్సిపల్ షాపులపై తగిన నిర్ణయం తీసుకోవాలని కౌన్సిలర్ సంసాని బులినాని కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడికి సూచించారు.